రైతుల చూపు బిందు సేద్యం వైపు



పొలంలో ఏర్పాటు చేసిన బిందు సేద్యం యూనిట్

- రాయితీలతో ప్రోత్సాహం అందిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 62.5 వేల ఎకరాల్లో ఏర్పాటు లక్ష్యం
- చెరకు సాగుకు ప్రాధాన్యం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: గత ఐదేళ్ల వైకాపా పాలనలో చతికిలపడ్డ బిందు, తుంపర్ల సేద్యం కూటమి ప్రభుత్వం రాకతో జీవం పోసుకుంది. 90 శాతం రాయితీని ప్రభుత్వం పునరుద్ధరించింది. దీంతో రైతులు బిందు, తుంపర్ల సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. జగన్ ప్రభుత్వంలో ఏటా కేవలం 11,250 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తుండగా, కూటమి ప్రభుత్వంలో ఏకంగా 53.75 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు ఆమోదం తెలిపింది. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో 62.5 వేల ఎకరాల్లో బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లు రైతులకు అందజేయనున్నారు. జిల్లాలో బిందు, తుంపర్ల యూనిట్ల కోసం రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి 23000 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేసుకోగా, తాజాగా 28000 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

90 శాతం రాయితీతో యూనిట్ల మంజూరు

బిందు, తుంపర్ల సేద్యం కింద సాగు చేసే రైతులకు 90 శాతం రాయితీతో యూనిట్లను అందజేయనున్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం, ఆపైబడి సాగుకు 75 శాతం సబ్సిడీ ఉంటుంది. కూరగాయల సాగుకు యూనిట్ ధర రూ.1.5 లక్షలు ఉండగా, పండ్ల తోటలకు యూనిట్ ధర రూ.30 వేలు ఉంది. ఇక, బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లను రైతుల పొలాల్లో అమర్చేందుకు జిల్లాలో దాదాపు 27 కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీల సామర్థ్యం ఆధారంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రాంతాల వారీగా రైతుల పొలాల్లో యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయి.

ప్రభుత్వం యూనిట్ ధరలు నిర్ణయించగానే, మొత్తంగా 51 వేల ఎకరాల్లో బిందు సేద్యం యూనిట్లు మంజూరు చేసేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో సాధారణంగా రైతులు సాగు చేసే ఉద్యాన పంటలైన టమోటా, వంకాయ, బీన్స్, ఉర్లగడ్డ, దానిమ్మ, జామ, మామిడి, కొబ్బరి, చెరకు, బొప్పాయి, తదితర పంటలకు బిందు సేద్యం యూనిట్లు అందజేయనున్నారు. ఈ ఏడాది జిల్లాలో చెరకు సాగు రైతులకు బిందు సేద్యంలో అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నగరి, నింద్ర, విజయపురం, కార్వేటినగరం తదితర మండలాల్లో చెరకు సాగు అధికంగా ఉన్న క్రమంలో రైతులను మరింత ప్రోత్సహించాలని ఏపీఎంఐపీ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి రైతుకు యూనిట్ ఇస్తాం

బిందు, తుంపర్ల సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అడిగిన ప్రతి రైతుకూ నిబంధనల ప్రకారం యూనిట్లు మంజూరు చేస్తాం. ఈ ఏడాది లక్ష్యం 53.75 వేల ఎకరాలు కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు 62.5 వేల ఎకరాలకు యూనిట్లు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటి వరకు 51 వేల ఎకరాల్లో యూనిట్లు ఇచ్చేందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేశాం.



- బాలసుబ్రమణ్యం, ఏపీఎంఐపీ పీడీ



మంత్రికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో కృష్ణారెడ్డి

ప్రజా పాలనతో ప్రశాంతత

- అంచెలంచెలుగా సూపర్ సిక్స్ పథకాల అమలు
- మంత్రి జనార్దన రెడ్డి వెల్లడి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30: రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమవడంతో ప్రజలు ప్రశాంతగా సేదతీరుతున్నారని రహదారులు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. కాణిపాకం వినాయకస్వామిని శుక్రవారం దర్శించుకున్న ఆయన.. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల పురోగతి కోసం సీఎం చంద్రబాబునాయుడు చాలా శ్రమిస్తున్నారన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను అంచలంచలుగా అమలు చేస్తామన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన అప్పుల కారణంగా రాష్ట్రం సర్వ నాశనమైందని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ రోడ్లు చాలా మేరకు దెబ్బతిన్నాయన్నారు. వీటిని బాగు చేయడానికి రూ.300 కోట్లతో పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా అనేక పరిశ్రమలు వస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా, అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నిర్విరామ కృషితో పని చేస్తున్నుంటే వైసీపీ పేటీఎం బ్యాచ్ రాద్ధాంతం చేస్తోందన్నారు. కాణిపాక క్షేత్రంలో సెప్టెంబరు 7 నుంచి 27 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు మంత్రిని ఏఈవో ఎస్వీ.కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

మొక్కలు నాటి.. చెట్లను చేద్దాం



మొక్కలు నాటుతున్న ఎంపీ దగ్గుమళ్ల, అటవీశాఖ అధికారులు

- జిల్లాలో ఘనంగా వన మహోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: అందరం మొక్కలు నాటి.. పెంచి చెట్లను చేద్దామని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. జిల్లాలో శుక్రవారం జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో వీరు మొక్కలు నాటి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటడం అలవరచుకోవాలని సూచించారు. ఉన్న అడవులను రక్షించుకోవడంతోపాటు ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. అడవులవల్ల భూగర్భ నీటిమట్టం పెరిగి పంటలు పుష్కలంగా సాగవుతాయని చెప్పారు. పెరుగుతున్న జనాభా.. వాహనాల వాడకానికి తగ్గట్టు పచ్చని చెట్లు పెరగకపోవడంతో కాలుష్యం నెలకొంటోందన్నారు. ఈ అనర్థాల నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. పలుచోట్ల విద్యార్థులు మొక్కల అవసరాన్ని చాటచెబుతూ ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు అటవీశాఖ తూర్పు విభాగంలో సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వో సోమశేఖర్, ఎఫ్ఆర్వో థామస్ ఆధ్వర్యంలో జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పాల్గొన్నారు. వృక్షాలే జీవనాధారాలని, అడవులు విస్తరించినప్పుడే మానవ మనుగడ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అడవుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. చెట్లను ఇష్టారాజ్యంగా నరకడం వల్ల జీవవైవిధ్యానికి నష్టం కలుగుతుందన్నారు. వన మహోత్సవంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి నగర రిజర్వు ఫారెస్టులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోనూ విద్యార్థులు మొక్కలు నాటారు.

గ్రానైట్ లారీ పట్టివేత

గుడుపల్లె, ఆగస్టు 30: శాంతిపురం మండలం రాళ్లబూదుగురు నుంచి తమిళనాడుకు గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని గుడుపల్లె పోలీసులు పట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. రాళ్లబూదుగురు నుంచి గుడుపల్లె మీదుగా తమిళనాడుకు గ్రానైట్ లారీలు వెళుతున్నట్లు సమాచారం అందింది. దీంతో కొన్ని రోజులుగా పోలీసులు నిఘా పెట్టారు. శుక్రవారం ఉదయం కుప్పం-పలమనేరు జాతీయ రహదారి శెట్టిపల్లె క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వేగంతో వస్తున్న గ్రానైట్ లారీని ఆపి.. డ్రైవర్‌ను ప్రశ్నించగా.. అతడి వద్ద గ్రానైట్ తరలింపునకు సంబంధించిన పత్రాలు లేవని ఎస్ఐ తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా తమిళనాడుకు గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. గ్రానైట్ లారీని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రానైట్ లారీని పలమనేరు ఏడీ మైన్స్ వారికి అప్పగిస్తామన్నారు.



డీఎల్ఎస్ఏకు ముగ్గురు సభ్యుల నియామకం

పూతలపట్టు, ఆగస్టు 30: చిత్తూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ)కు ముగ్గురు సభ్యులను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక కార్యకర్తగా పేరుపొందిన చిత్తూరు నగరం ఓబనపల్లెకాలనీకి చెందిన ధనంజయనాయుడు, విజయనగర్‌కాలనీకి చెందిన డాక్టర్ జనార్దన్‌రెడ్డి, యాదమరి మండలం కీనాటంపల్లెకు చెందిన హరినాయుడులను నియమించారు. వీరు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

ప్రైవేటు బస్సు బీభత్సం

- కారు, ఆటోను ఢీకొని, ద్విచక్రవాహనదారుడిపై దూసుకెళ్లిన వైనం
- ప్రమాద స్థలంలోనే మృతి చెందిన కూలీ







బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించిన గణపతి (ఫైల్ ఫొటో) - ఆటోను ఢీకొన్న బస్సు

చిత్తూరు, ఆగస్టు 30: చిత్తూరు నగరంలో శుక్రవారం ఓ ప్రైవేటు బస్సు బీభత్సం సృష్టించింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో ఎదురుగా వస్తున్న కారును ఢీకొని.. ఆ తర్వాత ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో.. అందులోని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఆ తర్వాత ఆటోనూ ఢీకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గుడిపాల మండలం రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లెకు చెందిన గణపతి(58) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. శుక్రవారం ఆయన బ్యాంకు పనిపై చిత్తూరుకు వచ్చారు. గిరింపేట నుంచి తన బామ్మర్దితో కలిసి నగరంలోకి వెళుతున్నారు. అదే సమయంలో గుడిపాల నుంచి చిత్తూరు వైపుగా వస్తున్న ప్రైవేటు బస్సుకు బ్రేక్ ఫెయిలైంది. దీంతో గిరింపేట బస్‌స్టాప్ వద్ద వేగంగా వస్తూ కారును ఢీకొంది. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో బైకుపై వెనుక కూర్చుని ఉన్న గణపతి అక్కడికక్కడే మృతిచెందగా.. బైకు నడుపుతున్న అతడి బామ్మర్దికి స్వల్ప గాయాలయ్యాయి. అయినా ఆగకుండా వెళుతున్న బస్సును ఆపాలని ఓ ఆటో డ్రైవరు ప్రయత్నించారు. బస్సుకు బ్రేక్ ఫెయిలైందనే విషయం తెలియక తన ఆటోను బస్సు ముందు ఉంచే ప్రయత్నం చేశారు.దీంతో ఆటోను ఢీకొని బస్సు ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారు, ఆటోలో ఉన్న వారికి స్వల్పగాయాలు కాగా.. ద్విచక్రవాహనంలో వెళుతున్న కూలీ గణపతి మృతిచెందారు. ఈ మేరకు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన ప్రైవేటు బస్సుపై ఇప్పటి వరకు 11 కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. గతవారం సీఎంసీ ఆస్పత్రి వద్ద ఓ మహిళ ప్రమాదానికి కారణమైంది. అలాగే నంగమంగళం వద్ద కారును ఢీకొనడంతో గుడిపాల స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా, జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నేతలు హేమాద్రి, బాలాజీ నాయుడు, పళణి, మురళి, జయచంద్ర తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అధికారుల సాయంతో పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: సెప్టెంబరు నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లు ఒకరోజు ముందుగానే అంటే శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 2,70,543 మంది లబ్ధిదారులకు గాను రూ.114.12 కోట్లు వచ్చాయని వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు. మొదటి రోజు అందించలేని వారికి సెప్టెంబరు రెండో తేదీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక నిల్వలు 1.16 లక్షల టన్నులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: జిల్లాలోని రెండు స్టాక్ యార్డుల్లో 1,16,388 టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు మైన్స్ డీడీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలూరు స్టాక్ యార్డులో 10,202 టన్నులు, దిగువమాసపల్లి స్టాక్ యార్డులో 1,06,186 టన్నులు ఉన్నాయని వెల్లడించారు. ఇసుక అక్రమాలపై ఫిర్యాదుల కోసం 08572-299509ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పథకాల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 30: జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్ అధికారి, పశుసంవర్ధక శాఖ, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖల ప్రభుత్వ కార్యదర్శి ఎం.నాయక్ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమర్థంగా పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. అందులో భాగంగా చిత్తూరు జిల్లాకు నాయక్‌ను నియమించింది. రెవెన్యూ సదస్సులు, పింఛన్ల పంపిణీ, వివిధ సర్వేలతో పాటు సంక్షేమ పథకాలను ఆయన పర్యవేక్షిస్తూ.. సమీక్షిస్తారు.

వినాయక మండపాలకు అనుమతి కావాలా?

- వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోండి

చిత్తూరు, ఆగస్టు 30: ఇప్పటి వరకు వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలంటే అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్‌శాఖ, పోలీసుశాఖల నుంచి నిరభ్యంతర(ఎన్‌వోసీ) పత్రం తీసుకోవాల్సి ఉండేది. వీటి కోసం నిర్వాహకులు ఆయా శాఖల చుట్టూ తిరిగేవారు. ఈ క్రమంలో ప్రభుత్వం వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారికోసం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని తీసుకొచ్చింది. 'గణేష్ ఉత్సవ్.నెట్' అనే వెబ్‌సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ రోజు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఏ వాహనం ద్వారా విగ్రహాన్ని తీసుకెళతారనే వివరాలను నమోదు చేసి, దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం 79950 95800 నెంబరు వాట్సాప్‌కు హాయ్ అని పెట్టాలి. అప్పుడు ఎన్‌వోసీ కోసం చేయాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా మొబైల్‌కు సమాచారం వస్తుంది. అలాగే దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళుతుంది. ఆ అధికారులు మండప ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీ జారీ చేస్తారు. నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసుకుని మండపాల్లో ఉంచాలి. పోలీసు అధికారులు సందర్శనకు వచ్చినప్పుడు క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసి తనిఖీ చేస్తారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ మణికంఠ కోరారు.

గల్లా అరుణకుమారి సాహస రచన స్వీయచరిత్ర

- ఆవిష్కరణ సభలో వక్తల అభిప్రాయం
- సందడిగా జరిగిన సభ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30: గల్లా అరుణకుమారిని రాజకీయ నాయకురాలిగా కాక ఆమెలోని పోరాట పటిమను, స్త్రీవాద కోణాన్ని 'గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర' పుస్తకం వెల్లడించిందని ఈ పుస్తకం ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తిరుపతి సమీపంలోని కరకంబాడిలో వున్న అమర రాజ కర్మాగారం ఆడిటోరియంలో శుక్రవారం గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకం ఆవిష్కరణ జరిగింది. నలభై ఏళ్ల రాజకీయాల్లోని పలు సందర్భాలను, నాయకులను నిర్మొహమాటంగా ఆమె రాసిన తీరు ఒక సాహసమే అని వక్తలు వ్యాఖ్యానించారు. పుస్తకాన్ని ప్రసిద్ధ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఆవిష్కరించి ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ, తండ్రి పాటూరి రాజగోపాల నాయుడు నుంచి నేర్చుకున్న విలువలను అరుణకుమారి ఆదర్శవంతంగా, ఆచరణాత్మకంగా జీవితాంతం పాటించారన్నారు. కొత్తగా రాజకీయాలలోకి వచ్చే వారికి ఇదొక పాఠ్య పుస్తకమన్నారు. ఈనాడు ఏపీ సంపాదకుడు మానికొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ... గల్లా కుటుంబంలోని రాజకీయ నేపథ్యం, గాంధేయవాదం స్వీయచరిత్రలో ఉన్నాయన్నారు. వెయ్యి పేజీల పుస్తకం ఆసక్తిగా చదివిస్తుందంటూ, విశ్వనాథ సత్యనారాయణగారి వేయిపడగలతో పోలికను వివరించారు.ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... గల్లా అరుణ కుమారికి తండ్రి ఆదర్శం అయినా, నానమ్మ విస్పష్ట స్వభావం ఆమెలో కనిపిస్తుందన్నారు. స్వతంత్ర్య పోరాట నాయకురాలిగా తల్లి అమరావతి కథను అరుణకుమారి రాయాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకాన్ని ప్రచురించిన ఎమెస్కో సంస్థ ఎడిటర్ డి. చంద్రశేఖరరెడ్డి అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకాన్ని సమీక్షిస్తూ ప్రసంగించారు. ఈ పుస్తకానికి కథానాయిక కంటే కథానాయకుడు అరుణకుమారి అని తెలిపారు. రచయిత లోని నిజాయితీ ప్రతి పేజీలోనూ కనిపిస్తుందని, పాఠకుని చదివించే గుణం దండిగా ఉందన్నారు. గల్లా జయదేవ్, డాక్టర్ రమాదేవిలు అమ్మ స్వీయచరిత్ర నేపథ్యాన్ని వివరించగా, గ్రంథస్థమైన ప్రతి సన్నివేశానికీ తాను సాక్షినని గల్లా రామచంద్రనాయుడు చెప్పారు. రచయితగా అరుణకుమారి స్పందిస్తూ, కుమార్తె రమాదేవి వెంటబడడంతోనే స్వీయచరిత్ర రాసేందుకు పూనుకున్నాని తెలిపారు.తాను రాసిన మూడువేల పేజీల రాతప్రతులను ఆమె సభ ముందుంచారు. రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు, పుస్తకప్రియుడు సాకం నాగరాజ, సురేష్‌లకు స్వీయచరిత్ర ప్రతులను సభావేదికపై అందించారు.గత నాలుగు దశాబ్దాలుగా గల్లా అరుణ కుమారి రాజకీయ జీవితంతో సంబంధం ఉన్న నాయకులు, కార్యకర్తలు, గల్లా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పలువురు ఈ సభలో పాల్గొని అరుణకుమారికి అభినందనలు తెలిపారు.



అరుణకుమారిలోని నిబద్ధత, సాహసం, నిజాయితీ ఈ గ్రంథంలో అడుగడుగునా కనిపిస్తోంది. ఇదొక చరిత్ర గ్రంథం. అధికార రాజకీయాలు, ముఖ్యంగా రాజకీయాలలో స్త్రీ పరిస్థితి ఎలా ఉంటుందో ఈ పుస్తకంలో వివరంగా ఉంది. స్త్రీ దృష్టికోణంలో ఒక రాజకీయ నాయకురాలు రాసిన అరుదైన ఆత్మకథ ఇది.

- ఓల్గా



ఎవరినో బాధపెట్టాలని గానీ, కించపరచాలని గానీ నేను ఈ పుస్తకం రాయలేదు. నా అనుభవంలో జరిగిన సంఘటనలను యథాతథంగా రాశాను. ఎవరి మనసుకైనా నొప్పి కలిగితే మన్నించండి.నా స్వీయచరిత్రకు స్పందనగా ఏది వచ్చినా ఎదుర్కొనేందుకు నేను సిద్ధమే.

- గల్లా అరుణకుమారి

గాలేరు-నగరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 1వ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.కోదండరామిరెడ్డిని రాష్ట్రప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఇదివరకూ ఓ రిట్ పిటిషన్‌కు సంబంధించి ఈయన హైకోర్టుకు కౌంటర్ అఫిడవిట్ సక్రమంగా దాఖలు చేయలేదని, దాంతో కోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ నివేదించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కోదండరామిరెడ్డి గతంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో అక్కడి గాలేరు-నగరి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 4వ యూనిట్‌కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేశారు. అప్పట్లో భూసేకరణ వివాదానికి సంబంధించి కె.నాగిరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ (నంబరు 119-2022) దాఖలు చేశారు. ఈ కేసులో కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్‌ను సక్రమంగా దాఖలు చేయకపోవడంతో విచారణ సందర్భంగా హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. దీంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసే సమయంలో ఆర్ అండ్ ఆర్ పాలసీ-2005, ఆర్ఎఫ్‌సీటీ ఎల్ఏ ఆర్ అండ్ ఆర్ యాక్ట్ -2013 చట్టాల్లోని అంశాలను విస్మరించారని, హైకోర్టుకు వాస్తవాలను వివరించడంలో విఫలమయ్యారని గుర్తించారు. ఈ కారణంగానే హైకోర్టు ఎదుట ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ప్రస్తుతం తిరుపతి జిల్లా గాలేరు-నగరి ప్రాజెక్టు 1వ యూనిట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.


ధ్వంసమైన ఏటీఎం

ఎస్బీఐ ఏటీఎంలో రూ.39 లక్షల చోరీ


ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

చంద్రగిరి, ఆగస్టు 30: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం స్థానికులు ఏటీఎంలో చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రామయ్య, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఏటీఎంను పరిశీలించి, వేలిముద్రల నిపుణులను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వేలి ముద్రలు సేకరించిన అనంతరం సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా గురువారం రాత్రి 1.30 నుంచి 2.30 గంటల మధ్యలో ఓ దుండగుడు సెక్యూరిటీ గార్డు ముసుగులో ఏటీఎం రూములో చొరబడ్డాడు. ఏటీఎం డిజిటల్ పాస్‌వర్డ్‌ను కీ ప్యాడ్‌ను పగలగొట్టి అందులో ఉన్న రూ.39 లక్షల నగదును ఎత్తుకెళ్లాడు. ఏఎస్పీ నాగభూషణం, క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ కూడా ఏటీఎంను పరిశీలించారు.బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఇప్పటివరకూ ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో పగులగొట్టి నగదును చోరీ చేసేవారు.ఈసారి డిజిటల్ లాక్ కీ ప్యాడ్‌ను పగలగొట్టి చోరీ చేయడం చూస్తుంటే ఇది ఏటీఎం టెక్నీషియన్ పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. చోరీ చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు చంద్రగిరి పోలీసులతో ఒక బృందాన్ని, తిరుపతి క్రైమ్ పోలీసులతో మరో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ నాగభూషణం తెలిపారు. చోరీ జరిగిన ఎస్బీఐ ఏటీఎంను ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం రాత్రి పరిశీలించారు.భద్రతా ఏర్పాట్లపై బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వలనే చోరీ జరిగిందంటూ అసహనం వ్యక్తం చేశారు.ఇకపై ఏటీఎంల వద్ద ఖచ్చితంగా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రమణకుమార్, సీఐ రామయ్య ఉన్నారు.


సీసీ పుటేజీలో బయటపడ్డ చోరుడు

జిల్లా ప్రత్యేకాధికారిగా సత్యనారాయణ

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రత్యేకాధికారిగా దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. అందులో భాగంగా తిరుపతి జిల్లాకు దేవదాయ శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న 2006 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎస్.సత్యనారాయణను ప్రత్యేక అధికారిగా నియమించింది.జిల్లాలో మొత్తం కార్యక్రమాలను ఆయన తరచూ పర్యవేక్షిస్తూ సమీక్షిస్తూ సక్రమంగా అమలయ్యేలా కృషి చేయనునున్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రోత్సాహకం



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: జిల్లాలోని రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకం ఇస్తోందని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మ్యాంగో భవన్‌లో ఉద్యాన, వ్యవసాయ, నాబార్డు సంయుక్తంగా రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల దుకాణం ఏర్పాటుకు, రైతులు పండించే కూరగాయలు, పండ్ల సేకరణ కేంద్రాలకు 75శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తోందన్నారు.నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లను సైతంఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. కూరగాయల సేకరణకు వాహనాలను సైతం సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో డీడీఏలు, ఏడీఏలు, ఏవోలతో ప్రకృతి వ్యవసాయంపై ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ, వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు నిర్వహించిన వికసిత్ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏటా 15 శాతం వ్యవసాయం అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని, అమలు చేయాలన్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు రండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30: కాణిపాక బ్రహ్మోత్సవాలకు రావాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఇన్‌చార్జి ఈవో వాణి కోరారు. ఈ మేరకు అమరావతిలో కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు గంగారపుహరిబాబునాయుడు, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ పాల్గొన్నారు.

సీడ్ బౌల్ కాన్సెప్ట్ ద్వారా తిరుమలలో మొక్కల పెంపకం : ఈవో


మొక్క నాటి నీరు పోస్తున్న ఈవో

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సీడ్ బౌల్ కాన్సెప్ట్ ద్వారా ఆధునిక సాంకేతికతను ఉపయోగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శాశ్వతంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వనమహోత్సవంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి పాల్గొన్న ఈవో తిరుమలలోని పద్మావతి విశ్రాంతి భవన ప్రాంగణంలో మాను సంపంగి 'స్థలవృక్షం' నాటారు. ఈవో మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు మరింత ఆహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో తిరుమలలోని వివిధ ప్రదేశాల్లో వందలాది మాను సంపంగి (మాగ్నోలియా చంపాకా), చందనం (సంతాలమ్ ఆల్బమ్), సీతా అశోక (సరకా అసోకా) మొక్కలను నాటారు. టీటీడీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులు, డిప్యూటీఈవోలు భాస్కర్, ఆశాజ్యోతి, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

తంబళ్లపల్లెవాసికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడ్డ మణికంఠ నాయక్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: తిరుపతి శ్రీనివాస సేతు (ఫ్లై ఓవర్)పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకి చెందిన మణికంఠ నాయక్ స్థానిక అలిపిరి శ్రీవారి సన్నిధి వద్ద ఉన్న పెట్రోలు బంకులో ఆరేళ్లుగా పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎస్వీ నగర్‌లో కాపురమున్న తన సోదరి ఇంటికెళ్లి తిరిగి తిరుచానూరు నుంచి అలిపిరికి ఫ్లైఓవర్‌పై ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. పీఎస్4 హోటల్ సమీపంలో ఫ్లైఓవర్‌పై నిబంధనలకు విరుద్ధంగా ఎదురుగా వస్తున్న ఏపీ03 టీఎల్ 4187 నెంబరు గల లగేజీ ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జవగా, మణికంఠ నాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బాధితుడి తండ్రి గోపాల్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ తరుణ్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్ - నిందితులు

చిత్తూరు, ఆగస్టు 30: తాగిన మైకంలో యువకుడిని బండరాయితో కొట్టి చంపిన కేసులో ముగ్గురు నిందితులను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సాయినాథ్ ఆ వివరాలను మీడియాకు వివరించారు. బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లెకు చెందిన షేక్‌దావూద్‌బాషా(25) రెండు రోజుల క్రితం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న బార్‌లో మద్యం తాగి అక్కడే పడుకున్నాడు. తోటపాళ్యంకు చెందిన మణికంఠన్, అతని స్నేహితులు కార్తీక్, వేములరాజులు అతన్ని లేపి మద్యానికి డబ్బు ఇవ్వాలని బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ.200 లాక్కుని మద్యం తాగారు. ఇంకా డబ్బులు కావాలని కొట్టుకుంటూ వీరభద్రకాలనీ శ్మశానం వద్దకు తీసుకెళ్లారు. రూ.20వేలు తీసుకురమ్మని బెదిరించారు. డబ్బు లేదని చెప్పడంతో ఆగ్రహానికి గురైన మణికంఠన్ పక్కనే ఉన్న రాయితో దావూద్‌బాషా తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఫోన్‌కాల్ ఆధారంగా పోలీసులు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 30: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. రామకుప్పంలో 10.8, శ్రీరంగరాజపురం 3.4, శాంతిపురం 3.2, బైరెడ్డిపల్లి 1.4, వి.కోటలో 1.0 మి.మీ వర్షం కురిసింది.

శ్రీవారికి 16 ద్విచక్ర వాహనాల విరాళం


ఈవో, అదనపు ఈవోకు వాహనాల తాళాలను అందజేస్తున్న వేణుసుదర్శన్

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం 16 ద్విచక్ర వాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్ మోటార్స్ ఎండీ వేణుసుదర్శన్ ఈ వాహనాలను అందజేశారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనాలకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం దాత వారికి వాహనాల తాళాలను అందజేశారు. 16 ద్విచక్ర వాహనాల్లో 15 ఎలక్ట్రికల్ వాహనాలు ఉన్నాయి. వీటి ధర దాదాపు రూ.22 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

రోగి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

● స్విమ్స్‌లో బాధితులతో కలిసి ఎమ్మార్పీఎస్ నేతల నిరసన


స్విమ్స్‌లో బాధితులకు మద్దతుగా నిలిచిన ఎమ్మార్పీఎస్ నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 30: స్విమ్స్‌లో మూడ్రోజుల కిందట కనిపించకుండా పోయిన రోగి ఆచూకీ కోసం స్విమ్స్ అధికారులు, పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అయినా ఆచూకీ తెలియక పోవడంపై బాధితులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను కుమారుడు విశ్వనాథ్ ఈనెల 27వ తేదీన వైద్యం కోసం స్విమ్స్‌కు తీసుకొచ్చారు. అదే రోజున సీతారామప్పను ఎంఐసీయూ వార్డులో అడ్మిషన్ చేసుకోగా, అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయంపై బాధితులు స్విమ్స్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా జాడ తెలియలేదు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు బాధితులకు మద్దతుగా నిలిచి శుక్రవారం స్విమ్స్‌లో నిరసన తెలిపారు. నడిచే స్థితిలో కూడా లేని వ్యక్తి అర్ధరాత్రి నాలుగు అంతస్తుల పైనుంచి ఎలా కిందకు వచ్చి, బయటకు వెళ్లాడో అధికారులే చెప్పాలని నాయకులు ప్రశ్నించారు. ఏదేమైనా తన తండ్రిని తమకు అప్పగించే బాధ్యత స్విమ్స్ యాజమాన్యాదేనని కుమారుడు విశ్వనాథ్ అన్నారు.

పలువురు వైద్యాధికారులకు, సిబ్బందికి మెమోలు! : స్విమ్స్‌లో రోగి కనిపించకుండా పోయిన విషయంపై పలువురు వైద్యాధికారులకు, సిబ్బందికి శుక్రవారం డైరెక్టర్ ఆర్వీకుమార్ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులైన వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని స్విమ్స్ అధికారులు పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.51 కోట్లు

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.51 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 62,529 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 29,730 మంది తలనీలాలు సమర్పించారు.

పిల్లలూ.. వెల్‌డన్

● జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 30: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జ్ఞాపికలు అందజేశారు. శుక్రవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల్లో రాణించిన ఐదుగురు క్రీడాకారులను అభినందించారు. ఇందులో బాస్కెట్‌బాల్ విభాగంలో రజత పతకం పొందిన ఎం.గురుచరణ్, ఖోఖో విభాగంలో కాంస్య పతకం పొందిన ఎ.రాజ్‌కుమార్, దక్షిణ భారత స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన ఇ.బద్రీనాథ్, ఫెన్సింగ్ విభాగంలో చిన్నారులు అర్చునిషా, ఐ.తులసీరామ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డీఎస్డీవో బాలాజీ, రెజ్లింగ్ కోచ్ ఎస్.రఫీ అహ్మద్, ఫెన్సింగ్ కోచ్ ఎం.రాఘవ కార్తీక్ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : డీఆర్ఎం


తిరుపతిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విజయ్ కుమార్

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 30: తిరుపతి, తిరుచానూరు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) విజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ నిర్వాహణ, స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారాల పరిశుభ్రతను మెరుగుపరచాలన్నారు. కోచ్ మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నారు. అంతకుముందు తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సీనియర్‌స్కేల్ అధికారులు శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, మణికంఠ, ఉపేంద్ర కుమార్, ప్రభాకర్, సురేష్ బాబు, మాధవరావు,ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై తనిఖీలు



తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు తిరుమలలో జరుగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం సాయంత్రం శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను పరిశీలించారు. వాహన మండపం నుంచి తనిఖీలు ప్రారంభించిన అధికారులు మాడవీధుల్లోని గ్యాలరీల్లోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, గరుడసేవలో గ్యాలరీలను రెండవసారి నింపడం, తదితర భద్రత అంశాలను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో చివరిరోజున చక్రస్నానం, ఇతర సంబంధిత అంశాలపై చర్చించారు. పుష్కరిణి లోపలికి వెళ్లే, బయటకు వచ్చే మార్గాలను కూడా పరిశీలించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు.

పరకామణిలోనూ..

అంతకుముందు శ్రీవారి హుండీ కానుకలు లెక్కించే పరకామణి భవనంలోనూ ఈవో, అదనపు ఈవో, సీవీఎస్వో తనిఖీలు నిర్వహించారు. హుండీల తరలింపు, నాణేలు, కరెన్సీల విభజన ప్రక్రియ, పరకామణి లెక్కింపులు, డ్రెస్‌కోడ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత సీసీటీవీ గదిని కూడా చూశారు. ఈ కార్యక్రమాల్లో సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 సత్యనారాయణ, పరకామణి ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, హెల్త్ డిప్యూటీఈవో ఆశాజ్యోతి, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, వీజీవోలు సురేంద్ర, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవా సదన్‌లో..

తిరుమలలోని శ్రీవారిసేవాసదన్ 1, 2 భవనాలను కూడా పరిశీలించారు.తిరుమలలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న శ్రీవారి సేవకుల నమోదు, లాకర్లు, స్కార్ఫ్‌లు, బెడ్‌లు, డ్యూటీల కేటాయింపు, ఆలయ విధులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ సిస్టమ్, సత్సంగం, ధ్యానం, భజన కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సేవాసదన్ 2లోని జీడిపప్పు వలిచే హాల్‌ను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత సేవాసదన్‌లలో పరిశుభ్రత, శ్రీవారిసేవకుల వసతి, అన్నప్రసాదం, దర్శనం తదితర సౌకర్యాలను ఈవో, అదనపు ఈవో పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పీఆర్వో నీలిమ, ఏవీఎస్వో సాయిగిరిధర్, శ్రీవారిసేవ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రద్దీలో అత్యవసర వాహనాల రాకపోకలకు అనువుగా ఏర్పాట్లు చేయాలి : ఎస్పీ సుబ్బరాయుడు

బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ అత్యవసర వాహనాలైన అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు సులువుగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయాలని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌తో కలిసి మాడవీధులతో పాటు తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన ఎస్పీ పోలీసు, విజిలెన్స్ అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల మధ్య ఎలాంటి తోపులాటలు లేకుండా పటిష్ఠమైన బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు నుంచి గ్యాలరీలను అనుసంధానం చేస్తూ క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఈ సమాచారాన్ని భక్తులకు తెలిపేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలిపిరి టోల్‌గేట్ వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే తిరుమలకు అనుమతించాలన్నారు. ఈకార్యక్రమంలో తిరుమల ఇన్‌చార్జ్ అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు, ఎస్ఐలు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

శ్రీనివాస కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

పుంగనూరు, ఆగస్టు 30: మండలంలోని భీమగానిపల్లె క్రాస్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం 6గంటల కు వేదపండితులతో నిర్వహించే శ్రీనివాస కల్యాణోత్సవంలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీసీవై పార్టీ అధినేత బోడె. రామచంద్రయాదవ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రావణ శనివారం చివరి వారం కావడంతో శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు హరినాథ్‌రెడ్డి, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మదన్‌మోహన్‌బాబు

సోమల, ఆగస్టు 30: మహిళలు స్త్రీనిధి రుణాలు పొంది జీవనోపాధులు పెంపొందించుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమాఖ్య మహజన సభలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు సక్రమంగా రుణాలు చెల్లింపులు చేయడంతో బ్యాంకులు రూ. 10లక్షల మేరకు రుణాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఎంపీడీవో నారాయణ, బీజేపీ నియోజక వర్గం ఇన్‌చార్జి గన్నా మదన్‌మోహన్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేశ్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, ఏపీఎం శివ, ఏపీవో దినకర్‌బాబు, స్త్రీనిధి మేనేజర్ రమ్య, సీసీలు గంగోజీ, నరసింహులు, సంఘమిత్రలు, మండల సమాఖ్య గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు.

బస్టాండులో మరుగుదొడ్లు నిర్మించాలి

చౌడేపల్లె, ఆగస్టు30: చౌడేపల్లె బస్టాండులో మరుగుదొడ్లు నిర్మించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కడియాల మనోహర్ పేర్కొన్నారు. గురువారం ఆయన పలమనేరు రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండును సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం రూ..50 లక్షలతో బస్టాండు నిర్మించారని, అది ఇప్పుడు నిరుపయోగంగా మారిందన్నారు. కేవలం పలమనేరు వెళ్లే ప్రయాణికులకు మాత్రం ఉపయోగంగా ఉందన్నారు. అన్ని బస్సులు బస్టాండులోకి వచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులు గండోడి ప్రవీణ్‌కుమార్, రెడ్డప్ప, శేఖర్, లీలాకుమార్‌నాగ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని నేలకూలిన విద్యుత్ స్తంభం



కల్లూరు, ఆగస్టు 30: పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీ మచ్చా ఎస్సీ కాలనీలోని విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో స్తంభం నేల కొరిగింది. విద్యుత్ స్తంభం రెండుగా విరిగిపోవడంతో తీగలు నేలవాలాయి. అయితే ప్రమాదం జరగకుండా గ్రామస్తులు విద్యుత్ సరఫరాను అపివేశారు. విద్యుత్ స్తంభం నాలుగు రోజుల క్రితం విరిగినా ఆ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామంలోని దిగువవీధి అంధకారంలోనే ఉంది. దీనిపై సంబంధిత సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. దీనిపై ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ పురుషోత్తం దృష్టికి తీసుకెళ్లగా మచ్చా ఎస్సీ కాలనీలో నేలకూలిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

ప్రభుత్వ టీచర్ ఆత్మహత్య


శ్రీదేవి (ఫైల్‌ఫొటో)

కుప్పం, ఆగస్టు 30: కుప్పంలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. కుప్పం ఆర్‌పేట జడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీదేవి (48)కి మూడేళ్ల కిందట మదనపల్లెకు చెందిన చిన్నప్పతో వివాహమైంది. చాలాకాలం పిల్లలు కలుగకపోవడంతో వేలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పదినెలలు చికిత్స తీసుకున్న తర్వాత ఒకే కాన్పులో కవల పిల్లలు పుట్టారు. నెల కిందట వేలూరు నుంచి వీరు బిడ్డలతో కుప్పం చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో భర్త ఆందోళనపడి పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయితే, పెద్దబంగారునత్తం చెరువులో శ్రీదేవి శవమై తేలింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టంకోసం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిజేరియన్ కావడం, అనారోగ్య సమస్యలతో శ్రీదేవి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

పసుపు, కుంకుమ అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఆగస్టు30: పట్టణ నడిబొడ్డున వెలిసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం భక్తులకు పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పరిటాల రవికి ఘన నివాళి



కల్లూరు, ఆగస్టు30: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలో శుక్రవారం నిర్వహించిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకల్లో పులిచెర్ల మండలానికి చెందిన టీడీపీ నాయకులు గోపీనాయుడు, గిరిబాబునాయుడు, పరంధామనాయుడు, సురేంద్ర, భాస్కర్ పాల్గొన్నారు. పరిటాల రవీంద్ర ఘాట్‌ను సందర్శించి ఆయనకు ఘన నివాళి అర్పించారు. అంతకు ముందు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి తిరుమల శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

వరసిద్ధుడికి రూ.2 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శుక్రవారం రూ.రెండు లక్షలు విరాళంగా అందింది. నెల్లూరు జిల్లా కందూరుకు చెందిన రాకేష్, కుమారస్వామి అన్నదాన కార్యక్రమానికి రూ.1,00,016, వీవీఎస్‌ఆర్‌కే ప్రసాద్ గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,116ను విరాళంగా అందించారు. పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి రూ.2లక్షల విలువైన కూరగాయలు అందించారు. దాతలకు సూపరింటెండెంట్ వాసు స్వామి వారి దర్శనం చేయించి, వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, జ్ఞాపిక అందించారు.

రేపు పెన్షనర్ల సమస్యలపై అవగాహన

పలమనేరు, ఆగస్టు 30: పలమనేరులోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు పెన్షనర్ల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్. సోమచంద్రారెడ్డి తెలిపారు. సర్వీసు పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ



పలమనేరు, ఆగస్టు 30: పలమనేరు డీఎస్పీ డి.ప్రభాకర్ శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని డీఎస్పీకి సూచించారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

సోమల, ఆగస్టు 30: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని సోమల ఎస్ఐ శివశంకర పేర్కొన్నారు. శుక్రవారం కేవీఎస్ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్, ఈవ్‌టీజింగ్, డ్రగ్స్‌కు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు, అధ్యాపకులు గౌతం, శివయ్య, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



కల్లూరు, ఆగస్టు 30: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రావణమాసం వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీనరసింహుడు భక్తులకు దర్శనమిచ్చాడు. ఉభయదారులుగా పులిచెర్లకు చెందిన రాధాకృష్ణ, గేటుకాడబెస్తపల్లికి చెందిన మారయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఆగస్టు30: బోయకొండ గంగమ్మ ఆలయంలో శ్రావణ మాస చివరి శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఆగస్టు 30: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మఠంగొల్లపల్లెలో పాలేటమ్మ ఊరేగింపు



సోమల, ఆగస్టు 30: నెల్లిమంద పాలేటమ్మ మలిజాతర నేపథ్యంలో అమ్మవారి ఉత్సవమూర్తిని శుక్రవారం ఇరికిపెంట పంచాయతీ దాదెంగొల్లపల్లె, సోమల పంచాయతీ మఠంగొల్లపల్లె, ముంద్రివారిపల్లెల్లో ఊరేగించారు. మహిళలు కర్పూరనీరాజనాలతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం



కుప్పం రూరల్, ఆగస్టు 3: కుప్పం మండలం చెక్కునత్తం గ్రామంలో శుక్రవారం సిమెంటు రోడ్డు పనులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నంలు భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, నాయకులు చెక్కునత్తం మణి, సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కంటి వైద్య శిబిరం

రామకుప్పం, ఆగస్టు 30: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శని, ఆదివారాల్లో నిర్వహించే ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు కోరారు. ముఖ్యంగా తెలుగు యువత సభ్యులు శిబిరంలో విధిగా పాల్గొని రోగులకు సహాయంగా ఉండాలని కోరారు.

వనాల వృద్ధితోనే మానవ మనుగడ


కుప్పంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, కలెక్టర్, అటవీ శాఖాధికారులు తదితరులు

కుప్పం, ఆగస్టు 30: వనాలను పెంచి వృద్ధి చేస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కుప్పంలోని నడిమూరు అటవీ శాఖ నర్సరీలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, గుంటూరు పీసీసీఎఫ్ ఆర్‌కె.సుమన్, తిరుపతి సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డిలు మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలో 38 శాతం అటవీ ప్రాంతం ఉన్నదన్నారు. ఈ అడవులను పరిరక్షించుకోవడంతోపాటు అదనంగా ఇంకా అడవులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అడవులవల్ల భూగర్భ జలవనరులు పెరుగాయని, తద్వారా పంటలు పుష్కలంగా సాగవుతాయని చెప్పారు. విద్యార్థి దశనుంచే పిల్లలు మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ననియాలలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో జయశంకర్, ఇతర అటవీ శాఖాధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : మండలంలోని పరికిదోన హైస్కూల్‌లో టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం మొక్కలు నాటారు. ఎఫ్ఎస్‌వో ఇంద్రాణి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు మొక్కలు నాటటం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఫ్‌బీవోలు మునిరాజ, రామచంద్ర, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు నాటాలి

సోమల : మానవ మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పుంగనూరు నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి గన్నా మదన్ మోహన్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వనమహోత్సవం సందర్భంగా పలు రకాల మొక్కలను నాటారు. పెద్దఉప్పరపల్లె హైస్కూల్ ఆవరణలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, అటవీశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, ఏపీఎం శివ, ఏపీవో దినకర్ బాబు, సీసీలు గంగోజీ, కృష్ణార్జున, గనేశ్, ఉమా తదితరులు పాల్గొన్నారు.


సోమలలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

చెట్లు మానవాళికి జీవనాధారం : డీఈవో



పలమనేరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో మొక్కనాటి నీళ్లు పోయిస్తున్న డీఈవో దేవరాజులు, ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పలమనేరు, ఆగస్టు 30: చెట్లు మానవాళి మనుగడకు జీవనాధారమని డీఈవో దేవరాజులు పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరులో వనమహోత్సవంలో భాగంగా ఉర్దూ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నియంత్రణకు చెట్లు కీలకమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, చెట్లను నరకకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎంఈవో లీలారాణి, హెచ్ఎంలు షంషేర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటించారు. కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాబు, వాయల్పాడు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశులు పర్యావరణ కాలుష్యనివారణలో చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీపీడీసీ కార్యదర్శి శ్రీపురం సీతారామయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రవీంద్రనాథ్‌రెడ్డి, వెంకటేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ మేరకే మధ్యాహ్న భోజనం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో దేవరాజులు

పలమనేరు: విద్యార్థులకు ప్రభుత్వ మెనూ మేరకే రుచికరమైన మధ్యాహ్న భోజనం అందజేయాలని డీఈవో దేవరాజులు సూచించారు. శుక్రవారం పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవంలో పాల్గొన్న అనంతరం డీఈవో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో లీలారాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీ గీత తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే కాలుష్య నివారణ సాధ్యం

డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి

గంగవరం, ఆగస్టు30: రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని అధిగమించాలంటే పచ్చదనం పెంపొందించడం ఒక్కటే మార్గమమని డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగవరం ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి డీఎఫ్‌వో హాజరై ప్రసంగించారు. పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా పచ్చనిచెట్ల సంఖ్య పెరగకపోవడం బాధాకరమన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆక్సిజన్ అందించడానికి ఇప్పటినుంచి మొక్కల పెంపకం ఒక్కటే మార్గమన్నారు. అందుకే ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు, వాటి సంరక్షణను బాధ్యతగా గుర్తించి పచ్చదనం పెంపొందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో శివన్న, కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీసుధ, ఎన్ఎస్ఎస్ అమరనాథ్, మలిచెట్ల దేవేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనానికి చెట్లే మార్గదర్శకం

మానవుడు ఆరోగ్యకర జీవనం సాగించాలంటే చెట్ల పెంపకం ఒక్కటే మార్గమమని మదర్‌థెరీసా కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు పచ్చదనం ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కిషోర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న డీఎఫ్‌వో

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



పుంగనూరులో తహసీల్దార్ కార్యాలయం ముందు యూటీఎఫ్ నాయకుల నిరసన , పలమనేరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, ఆగస్టు30: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఎలాంటి భరోసా ఉండదని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు డీటీ తనీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, రమణ, శంకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం, రామయ్య, పోతయ్య, మురాదుల్లా, సూర్యప్రకాశ్, లోక్‌నాథ్‌రెడ్డి, పితాంబరం, జగన్నాథం, షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు : యూపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పెన్షన్ అనేది భిక్షాటన కాదని, ఉద్యోగుల హక్కు అని అన్నారు. అనంతరం వారు తహసీల్దార్ అన్బునాథన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రకాష్, జిల్లా నాయకులు బాబు, కృష్ణమూర్తి, ప్రసన్నకుమార్, ప్రజాసంఘాల నాయకులు గిరిధరగుప్తా, భువనేశ్వరి, ఎల్ఐసీ యూనియన్ నాయకులు మునిరాజ, పలమనేరు యూటీఎఫ్ డివిజన్ నాయకులు వేమచంద్రరెడ్డి, భాస్కరయ్య, సుబ్రమణ్యం, అరీఫ్, మోహన్, మునిరాజ, అమీర్‌వల్లీ, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలి

ఐరాల, ఆగస్టు 30: రోడ్డు ప్రమాదం చేసి, ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, చినవెంకటంపల్లె ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం వైఎస్.గేటులో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్.గేటు వారపు సంత నుంచి వస్తున్న చినవెంకటంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన కె.మునిరత్నంను చిత్తూరు నుంచి ఐరాల వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న సురేంద్ర ఢీకొట్టాడని తెలిపారు. మునిరత్నం అక్కడికక్కడే మృతి చెందినా నిందితుడిని పోలీసులు అరెస్టు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. అతన్ని అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న ఐరాల ఎస్ఐ నరసింహులు అక్కడికి చేరుకుని సురేంద్రను అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.


వైఎస్ గేటులో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రేపు ఏపీటీఎఫ్ జిల్లా విద్య వైజ్ఞానిక సదస్సు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: ఏపీటీఎఫ్ 1938 ఏర్పడి 80 ఏళ్లు పూరైన సందర్భంగా ఆదివారం స్థానిక శాంతా రఘురామన్ కల్యాణ మండంలో జిల్లా విద్య వైజ్ఞానిక మహాసదస్సు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగ్రాయ మండడి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, ఉపాధ్యాయులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



చిత్తూరు రూరల్, ఆగస్టు 30: చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి హైస్కూల్‌లో మౌలిక వసతులు కల్పన కోసం 1989 బ్యాచ్ విద్యార్థులు రూ.80 వేలు విరాళంగా ఇచ్చారు. శుక్రవారం హెచ్‌ఎం రెడ్డెమ్మకు ఈ మేరకు నగదు అందజేశారు. చదివిన పాఠశాలకు తమవంతు సాయం అందించామన్నారు. పూర్వ విద్యార్థులు చక్రధర్‌నాయుడు, బాలాజీ, హేమనాథ్ పాల్గొన్నారు.

వరసిద్ధుడికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత - కూరగాయలు అందిస్తున్న రవీంద్రారెడ్డి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శుక్రవారం రూ.రెండు లక్షలు విరాళంగా అందింది. నెల్లూరు జిల్లా కందూరుకు చెందిన రాకేష్, కుమారస్వామి అన్నదాన కార్యక్రమానికి రూ.1,00,016, వీపీఎస్ఆర్‌కే ప్రసాద్ గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,116ను విరాళంగా అందించారు. పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి రూ.2లక్షల విలువైన కూరగాయలు అందించారు. దాతలకు సూపరింటెండెంట్ వాసు స్వామి వారి దర్శనం చేయించి, వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

చిత్తూరు, ఆగస్టు 30: దోమల నియంత్రణకు ప్రజారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జనావాసాల మధ్య ఫాగింగ్, స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వేస్తున్నారు. నీటి కుంటలు, కాలువలు, నీటి నిల్వ ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో దోమల మందు పిచికారీ చేస్తున్నారు. 34వ డివిజన్‌లోని నీవానది, 5వ డివిజన్‌లోని కామేశ్వర్‌నగర్‌లో డ్రోన్ సాయంతో ఆయిల్‌బాల్స్ వేశారు. ఎంహెచ్‌వో అనిల్ కుమార్ నాయక్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమరనాథరెడ్డి, మలేరియా అసిస్టెంట్ అధికారి మురళి పాల్గొన్నారు.

రోడ్డు దుస్థితిపై సీపీఐ నిరసన



నగరి, ఆగస్టు 30: కుశస్థలీ నది వద్ద గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని శుక్రవారం సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కుశస్థలీ నది సమీపాన రోడ్డుపై గుంతలు అధికంగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని తెలిపారు. తక్షణం మరమ్మతు చేయకుంటే సెప్టెంబరు 15వ తేదీ నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ నగరి పట్టణ కార్యదర్శి వేలన్, సీఐటీయూసీ నగర కార్యదర్శి షబ్బీర్‌బాషా, సీపీఐ కౌన్సిల్ సభ్యులు విజయకుమార్, శేఖర్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.





సీఐ బాధ్యతల స్వీకరణ



బంగారుపాళ్యం, ఆగస్టు 30: బంగారుపాళ్యం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ లక్ష్మయ్య వీఆర్‌కు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న శ్రీనివాసులు ఇక్కడికి వచ్చారు.

ప్రకృతి పరిరక్షణకు మొక్కలు నాటాలి

బంగారుపాళ్యం, ఆగస్టు 30: వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం అంబేడ్కర్ భవన్ ఆవరణలో డ్వామా పీడీ రాజశేఖర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఏపీడీ రవి, ఎంపీడీవో శివశంకర్, ఏపీవో కిరణ్, మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజ, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, జనార్దన్ గౌడ్, రాధాకృష్ణమనాయుడు, సూరి, రమేష్ పాల్గొన్నారు.

మొక్కలను పరిరక్షించాలి

వెదురుకుప్పం, ఆగస్టు 30: వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం కార్వేటినగరం అటవీ శాఖ ఉద్యోగులు, జనసేన, టీడీపీ నాయకులు కార్వేటినగరంలో మొక్కలు నాటారు. వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని ఉద్యోగులు కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్, టీడీపీ నాయకులు రవియాదవ్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

వెదురుకుప్పం, ఆగస్టు 30: కార్వేటినగరం మండలం సీడీకండ్రిగలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఏవో హేమలత శుక్రవారం పరిశీలించారు. మండలంలోని గాదంకి, అన్నూరు, ఈడిగపల్లి, గోపిశెట్టిపల్లెలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాకు వివరాలను పరిశీలించారు.

ద్రౌపదీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 30: కార్వేటినగరం ద్రౌపదీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. రాహుకాల పూజలు, కుంకుమార్చనలు జరిపించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన కార్యదర్శి హరిబాబు, కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

నగరి, ఆగస్టు 30: మొక్కలు పెంచడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చునని నగరి మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ అన్నారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం వనం.. మనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ నీలమేఘంతో కలిసి ఆయన మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నా యన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

నగరి, ఆగస్టు 30: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలలో టీచర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

శ్రీరంగరాజపురం, ఆగస్టు 30: పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సురేష్‌పిళ్లై ఉద్యోగ విరమణ చేయడంతో శుక్రవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మహబూబ్ బాషా, హెచ్‌ఎం హేమాద్రి నాయుడు మాట్లాడుతూ పాఠశాలకు రమేష్ పిళ్లై చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

తవణంపల్లె, ఆగస్టు 30: గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చిరంజీవి వివరాల మేరకు.. చిత్తూరు-అరగొండ రహదారి కాణిపాకం క్రాస్ సమీపంలో పట్నం పైపల్లెకు చెందిన రైతు పొలం పక్కన ముళ్లపొదల్లో 43 ఏళ్ల వయసు కలిగిన మహిళ మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శవ పరీక్షకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

చిత్తూరు, ఆగస్టు 30: ఒక రోజు ముందుగానే(శనివారం) పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ అరుణ చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో తొలిరోజే వంద శాతం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి, ఆగస్టు 30: నగరి మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుందని కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొ న్నారు. అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్లు హాజరుకావా లని కోరారు.

వివాహిత ఆత్మహత్య

బంగారపాళ్యం, ఆగస్టు 30: జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని వెళతురుచేను గ్రామానికి చెందిన జయకాంత్ భార్య ప్రమీల (21) జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో మోల్డింగ్ కమ్మికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు వికలాంగ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

24 గంటల వైద్య సేవలు ఇలాగేనా?

పెనుమూరు సీహెచ్‌సీలో అందుబాటులో లేని డాక్టర్లు
సాయంత్రం 4 దాటితే చిత్తూరుకు వెళ్లాల్సిందే

పెనుమూరు, ఆగస్టు 30: పెనుమూరు సీహెచ్‌సీలో పేరుకుమాత్రమే 24 గంటలు వైద్యం.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. 2022వ సంవత్సరంలో 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో 11 మంది డాక్టర్లతో 32 మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. ఆపరేషన్లు, రక్తపరీక్షలు, ప్రసవాలు, టీబీ పరీక్షలతో పాటు అనేక సదుపాయాలు కల్పించింది. 24 గంటలు ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ఆరోగ్య కేంద్ర స్థాయిని పెంచింది. ఓపీలు రోజుకు 250పైనే నమోదవుతున్నాయి. అయితే ఉదయం 10 గంటల వరకు డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. సాయంత్రం 4 దాటకముందే వెళ్లిపోతున్నారు. అత్యవసరమైతే రోగులు చిత్తూరు, తిరుపతికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రిపూట కూడా డాక్టర్లు అందుబాటులో ఉండాలనే నిబంధన ఉన్నా ఆ ఊసేలేదు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు పలువురు రోగులు ఇదే విషయమై ఆయనకు ఫిర్యాదు చేశారు. రిజిస్టర్ తనిఖీ చేయగా కొందరు విధులకు హాజరుకాకపోవడం గమ నించి ఉన్న డాక్టర్లను నిలదీశారు. రాత్రిపూట కచ్చితంగా డాక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అయినా మార్పు రాలేదు. నిర్లక్ష్య ధోరణితోనే వ్యవహరిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంట లకు ఒక్క డాక్టరే అందుబాటులో ఉండటంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జ్వరాలు ప్రబలుతున్న ప్రస్తుత నేపథ్యంలో ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.



ఉదయం 10 గంటలైనా డాక్టర్లు రాకపోవడంతో వేచి ఉన్న రోగులు

పాత పెన్షన్ అమలు చేయాలని యూటీఎఫ్ నిరసన



చిత్తూరు డీఈవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్ (ఏకీకృత పెన్షన్ స్కీం)ను రద్దు చేసి, దాని స్థానంలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక డీఈవో కార్యాలయం ముందు యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలు ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటులో అసంబద్ధతను తొలగించాలని కోరుతూ డీఈవో దేవరాజుకు వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్, రెహానా బేగం, రెడ్డెప్ప, బాషా పాల్గొన్నారు.

నగరి : నగరి టవర్‌క్లాక్ వద్ద శుక్రవారం సాయంత్రం యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. యూపీఎఫ్ వద్దు.. పాతపెన్షన్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఒకే పెన్షన్, ఒకే భారత్ విధానాన్ని పాటించాలన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు మునిరత్నం, నాయకులు జనార్దన్, భువనేశ్వరి, హేమంత్‌కుమార్, కన్నెప్ప, హరిదాస్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

వెదురుకుప్పం : కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేయాలని కోరారు.

వైభవంగా వేణుగోపాలస్వామి పవిత్రోత్సవాలు



పురవీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలుడు

వెదురుకుప్పం, ఆగస్టు 30: కార్వేటినగరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆలయాధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. మూల వర్లకు తిరుమంజనం సమర్పించారు. భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. తర్వాత శుద్ధి, రాత్రి నివేదన జరిపించారు. సాయంత్రం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, షరాబు రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు గోపాలాచార్యులు, శబరి, రమేష్ పాల్గొన్నారు.

నాలుగో రోజూ కొనసాగిన నిరసన



చిత్తూరు రూరల్, ఆగస్టు 30: వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలను వాయిదా వేయాలని ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసస్ అసోసియేషన్ నాయకులు చేస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. గత ప్రభుత్వంలో పునర్ వ్యవస్థీకరణ పేరిట జరిగిన తప్పిదాలపై విచారణ చేపట్టి, వాటిని సరిదిద్ది బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గడిచిన ఐదేళ్లలో వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని కోరారు. కాగా, బదిలీల ప్రక్రియను సెప్టెంబర్ 15వ తేదీ వరకు వాయిదా వేసిన సీఎం చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్ణం, కార్యదర్శి గిరిధర్, ఉపాధ్యక్షుడు జగదీష్‌బాబు, కోశాధికారి సురేష్‌బాబు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని ధర్నా



ఐరాల, ఆగస్టు 30: రోడ్డు ప్రమాదం చేసి, ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, చినవెంకటంపల్లె ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం వైఎస్.గేటులో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్.గేటు వారపు సంత నుంచి వస్తున్న చినవెంకటంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన కె.మునిరత్నంను చిత్తూరు నుంచి ఐరాల వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న సురేంద్ర ఢీకొట్టాడని తెలిపారు. మునిరత్నం అక్కడికక్కడే మృతి చెందినా నిందితుడిని పోలీసులు అరెస్టు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. అతన్ని అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న ఐరాల ఎస్‌ఐ నరసింహులు అక్కడికి చేరుకుని సురేంద్రను అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విద్యుత్ స్తంభాలు తెచ్చిన తంటా..
అర కిలోమీటర్ దూరంలో ఆగుతున్న ఆర్టీసీ బస్సు

పాలసముద్రం, ఆగస్టు 30: వనదుర్గాపురం గ్రామానికి పాలసముద్రం నుంచి 33కేవీ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వనదుర్గాపురం ఎస్టీ కాలనీ నుంచి చలమరాజు ఇండ్ల వరకు అర కిలోమీటరు సిమెంటు రోడ్డు ఉంది. దీనికి ఆనుకుని ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డు వెడల్పు చాలా తక్కువ ఉంది. చిత్తూరు నుంచి వనదుర్గాపురానికి ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు నడుపుతున్నారు. విద్యార్థులు ఇందులోనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు నాటడంతో 15 రోజులుగా ఆర్టీసీ బస్సులు వనదుర్గాపురానికి కాకుండా అర కిలోమీటరు ముందున్న ఎస్టీ కాలనీ వరకే ఆపేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఎస్టీకాలనీ వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను రోడ్డుకు దూరంగా నాటించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న హెచ్‌ఎం కోమల

ఐరాల, ఆగస్టు 30: ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కారం లభించినట్లు హెచ్‌ఎం కోమల శుక్రవారం తెలిపారు. 2023-24 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలలో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారన్నారు. వరసగా మూడోసారి ప్రతిభా పురస్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు మెసానికల్ క్రీడా మైదానంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాలకు ఐలవారిపల్లెకు చెందిన గురివిరెడ్డి ట్రస్టు ద్వారా రూ.4 లక్షలతో ఆట సామగ్రి అందించడం ఆనందంగా ఉందన్నారు.

నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్తు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: నైపుణ్యం పెంచుకోవడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన జరిగిన ఫ్రెషర్స్‌డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోటీ ప్రపంచానికనుగుణంగా విద్యార్థినులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఎంపిక చేసుకున్న రంగాల్లో రాణించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి పాల్గొన్నారు.

జెత్వాని కేసులో పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలి

చిత్తూరు సిటీ, ఆగస్టు 30: ముంబై సినీ నటి, డాక్టర్ జెత్వాని పట్ల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని టీడీపీ సీనియర్ నేత, చిత్తూరు కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జెత్వానీ ఘటన దేశాన్ని కుదిపేస్తోందన్నారు. మాజీ సీఎం జగన్, మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పోలీసు అధికారులతో కలసి ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయాల్లో శుక్రవార పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మూలవర్లకు పూలతో ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.





నిరుపయోగంగా బస్ షెల్టర్

వెదురుకుప్పం : కార్వేటినగరం మండలం డీఎంపురంలో బస్సు షెల్టరు నిరుపయోగంగా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన ఈ షెల్టర్ నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. తరచూ విష పురుగులు కనిపిస్తుండడంతో అక్కడ వేచి ఉండేందుకు జనం భయపడుతున్నారు. పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించి ఉపయోగంలోకి తేవాల్సి ఉంది.



నత్తనడకన భవన నిర్మాణం

వెదురుకుప్పం : కార్వేటినగరం మండలం డీఎంపురంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు సరిగా రాక.. బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు ఆపేశారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొత్త పాలకులైనా దాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.